# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- బాపట్ల జిల్లాలో ఈరోజు చోటు చేసుకున్న క్వారీ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.
- సింగపూర్ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ కి భారీ పెట్టుబడులు రానున్నాయని మంత్రి టి. జి. భరత్ విశ్వాసం వ్యక్తం చేశారు.
- భారత్-ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న చివరి టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయానికి ఇంకా 6 వికెట్లు తీయాల్సి ఉంది.

==================================

విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం నడిపల్లి మండల పరిషత్ పాఠశాలలో అభివృద్ధి పనులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి మంత్రి శ్రీనివాస్ ఈరోజు ప్రారంభించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే, సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

==================================

బాపట్ల జిల్లాలో ఈ రోజు ఘోర ప్రమాదం జరిగింది. బల్లికురవ సమీపంలో ఒక క్వారీలో బండరాళ్లు విరిగి పడటంతో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరి కొంత మందిని నరసరావుపేట ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో క్వారీలో 16 మంది కార్మికులు పని చేస్తున్నారు. మృతులు ఒడిశా వాసులుగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం

చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై విచారణ జరపాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రమాదంపై జిల్లా ఎస్పి తుషార్ దూడి మాట్లాడుతూ...

(వాయిస్ 33 సెకన్లు)

=================================

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు 2 లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెడుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఆయన ఈ రోజు తిరుపతిలో పర్యటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రానికి ప్రైవేట్ పరంగా 7 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిస్తోందని పేర్కొన్నారు. మౌళిక వసతుల కల్పనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పిఎం ఆవాస్ యోజన, ముద్ర యోజన, బేటి బచావో.. బేటి పడావో.. వంటి పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామన్నారు.

=================================

సింగపూర్ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ కి భారీ పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి టి. జి. భరత్ తెలిపారు. ఈ రోజు మంత్రి కర్నూల్ లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి జరిపిన సింగపూర్ పర్యటన విజయవంతమైందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో వివిధ ప్రాజెక్టుల్లో భాగస్వాములు కావాలంటూ.. చంద్రబాబు నాయుడు ఆహ్వానం మేరకు పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి కనబరచారని మంత్రి వివరించారు. అపార వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్ లో వ్యాపార అభివృద్ధికి పెద్ద ఎత్తున అవకాశాలను పారిశ్రామిక వేత్తలు గుర్తించారని చెప్పారు. వివిధ రంగాల్లో లక్షల కోట్ల రూపాయాల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని మంత్రి టీ.జీ. భరత్ ఈ సందర్భంగా వెల్లడిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

విరామం

=================================

గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. ఈనెల 9వ తేదీ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందన్నారు. గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలు, వసతి గృహ సదుపాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందిస్తూ.. జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

=================================

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామి వారిని మంత్రి ఈ రోజు దర్శించుకున్నారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ప్రజారంజకంగా సాగుతోందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టామని హోం మంత్రి తెలిపారు.

=================================

అవయవదానంపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఈ రోజు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన తక్కువగా ఉందని, ఈ అంశంపై విరివిగా జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే, అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. వైద్యులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఇతరుల జీవితంలో వెలుగులు నింపే అవయవదానంపై అపోహలు వీడాలని సూచించారు.

===================================

తిరుమలలో భక్తులకు సులభతరంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనం కల్పించే అంశంపై అధ్యయనం చేసేందుకు గూగుల్, టీసీఎస్ సంస్థలు ముందుకు వచ్చాయని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలిపారు. ఈ రోజు తిరుపతిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రపంచం మొత్తం కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తోందని, భక్తుల ఇబ్బందులు తొలగించడానికే ఈ సాంకేతికతను వినియోగించాలని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని వెల్లడించారు. ఆ మేరకు గూగుల్, టీసీఎస్ సంస్థలు ఉచితంగా సేవలు అందిస్తున్నాయని స్పష్టం చేశారు.

===================================

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఐదవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. 324 పరుగుల లక్ష్యాన్ని ఛేధించేందుకు ఈరోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టు భోజన విరామ సమయానికి 3 వికెట్లు నష్టపోయి 164 పరుగులు చేసింది. మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ ఈరోజు తొలి సెషన్‌లో చెరో వికెట్ తీశారు. ఇంగ్లాండ్ బ్యాట్స్ మెన్ జో రూట్ 23 పరుగులు, హేరీ బ్రూక్ 38 పరుగులతో క్రీజ్‌లో కొనసాగుతున్నారు. ఇంగ్లాండ్ మరో 210 పరుగులు చేసినట్లయితే సిరీస్ ను కైవసం చేసుకుంటుంది. అదే భారత్ మిగిలిన 6 వికెట్లను తీసినట్లయితే 2-2 తో సిరీస్‌ను సమం చేస్తుంది.

===================================

ఉత్తర తమిళనాడు తీర ప్రాంతం, నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉండడంతో ఉత్తర కోస్తాంధ్రలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు పలు చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. మరికొన్ని చోట్ల బలమైన గాలులు గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

===================================
===================================